

అమ్మవార్లకు తిరునక్షత్రం పూజలు

సత్తెనపల్లి: వడ్డవల్లి శ్రీ రామాలయం, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం శ్రీ గోదాదేవి, శ్రీలక్ష్మీ అమ్మవార్లకు తిరు నక్షత్రం పూజలు నిర్వహించారు.



గోదాదేవి జన్మదిన వేడుకలు

మాచర్ల: మాచర్ల శ్రీ కోదండరామాలయంలో సోమవారం గోదాదేవి అమ్మవారి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

గోవాడలో శ్రావణ పూజలు



అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరు మండలం గోవాడలో కొలువైన శ్రీ బాల కోటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం శ్రావణ పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

కూలేందుకు సిద్ధం



పెదకూరపాడు: మండలంలోని పాటిబండ్ల – పెదకూరపాడు మధ్య ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జి బీటలు వారుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఇది మరింత ప్రమాదంగా మారి, ఏక్షణమైనా కూలేందుకు సిద్ధమైంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, బ్రిడ్జికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


కోడెల శిలాఫలకం ధ్వంసం



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మాజీ స్పీకర్, సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే దివంగత డాక్టర్ కోడెల శివప్రసాదరావు పేరును గుర్తు తెలియని దుండగులు ఆదివారం రాత్రి పగలగొట్టారు. పేరేచర్ల–కొండమోడు జాతీయ రహదారిలో పట్టణంలోని తాలూకా సెంటర్‌లో రహదారి డివైడర్ పై మూడు నెలల క్రితం కోడెల శివప్రసాదరావు విగ్రహాన్ని ఏర్పాటు చేసి కోడెల శివప్రసాదరావు చౌక్‌గా నామకరణం చేసి ప్రారంభించారు. ఈ శిలాఫలకంపై ఉన్న పేరును గుర్తుతెలియని దుండగులు పగలగొట్టారు. నిత్యం రద్దీగా ఉండే తాలూకా సెంటర్లో ఎవరైనా కావాలనే పగలకొట్టారా? లేక ఏదైనా వాహనం వెళుతూ తగిలి ఆ పేరు ఉన్న టైల్ ఊడిపోయిందా అనేది తేలాల్సి ఉంది.

చిత్రకళలో రెండు అవార్డులు





వినుకొండ: భగీరథి ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఆర్ట్స్ కాంపిటీషన్‌లో మండలంలోని గోకనకొండ గ్రామానికి చెందిన చిత్రకారుడు వల్లెం కృష్ణకు అవార్డులు వచ్చాయి. వల్లెం కృష్ణ వేసిన రెండు బొమ్మలకు ఆర్ట్ ఎక్స్‌పర్ట్, టాలెంటెడ్ ఆర్టిస్ట్ అవార్డులు వరించాయి. రాజమండ్రిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ అవార్డులు అందుకున్నట్లు కృష్ణ సోమవారం తెలిపారు.

వైద్య సిబ్బందికి నియామక ఉత్తర్వులు



గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫార్మసిస్టులు– 20, ల్యాబ్ టెక్నీషియన్లు–3, డేటా ఎంట్రీ ఆపరేటర్లు –16, ఎల్‌జీఎస్‌లు – 47 పోస్టులకు సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి, వైద్య సేవలు నిరంతరంగా అందించాలని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, పరిపాలనా అధికారి లక్ష్మీకుమారి, ఆఫీస్ సూపరింటెండెంట్ భక్తవత్సలం, అకౌంట్ ఆఫీసర్ కృష్ణకుమారి, డీపీఓ సైమన్ రాజు, సీనియర్ అసిస్టెంట్లు ప్రసాద్, కార్తిక్ పాల్గొన్నారు.

నేడు జీజీహెచ్‌లో ఓపీ ఆన్‌లైన్ సేవలకు అంతరాయం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఏబీడీఎం ఈ– హాస్పిటల్ ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఓపీ, లేబరేటరీ, ఇన్ పేషంట్ సేవలను డిజిటల్ విధానంలో చేపడుతున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వాడుతున్న ఏబీడీఎం వర్షన్ నెక్స్‌జెన్ మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మైగ్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. దీని వల్ల సాయంత్రం 9 గంటల వరకు ఆన్‌లైన్ సేవలకు అంతరాయం ఏర్పడుతుందని వెల్లడించారు. రోగులకు ఇబ్బంది లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ విషయాన్ని సిబ్బంది, రోగులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఆంక్షల బస్సు

హామీ తుస్సు

- ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అంటున్న కూటమి ప్రభుత్వం
- కేవలం పల్లె వెలుగు, అల్ట్రా డీలక్స్ బస్సులకే పరిమితం
- తొలుత రాష్ట్రవ్యాప్తంగా.. నేడు జిల్లా వరకే అంటూ సన్నాయి నొక్కులు
- ప్రయోజనం స్వల్పమే అంటున్న మహిళలు
- ఎన్నికల హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్సుల్లో అమలు చేయాలని డిమాండ్
- జిల్లా ఆర్టీసీలో తీవ్రంగా బస్సుల కొరత
- జిల్లాలో సుమారు 14 లక్షల మంది మహిళకు గాను ఉన్నది 325 పల్లె వెలుగు బస్సులే..
- రద్దీ సమయాల్లో మరిన్ని సర్వీసులు నడిపితేనే ప్రయోజనం



వినుకొండ ఆర్టీసీ బస్సులో సీట్లన్నీ నిండిపోవడంతో నిలబడి ప్రయాణిస్తున్న మహిళలు

సాక్షి, నరసరావుపేట: సూపర్–6లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణమన్న హామీని ఏడాది దాటినా అమలు చేయకుండా వాయిదాల మీద వాయిదాలు వేస్తూ కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తూ వస్తోంది. గత కొంత కాలంగా ఆగస్టు 15 నుంచి ఉచిత ప్రయాణం ప్రారంభిస్తామని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీకి, ప్రస్తుతం మంత్రులు చెబుతున్న మాటలకు పొంతన ఉందా, ఆర్టీసీ ఉచిత బస్సు హామీ అమలు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేసిందా, ఇప్పటికీ జిల్లాలో ఆర్టీసీ బస్సులు వెళ్లని గ్రామాలెన్ని అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం హామీని అమలు చేశామని చెప్పి చేతులుదులుపుకొనేలా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రద్దీ అధికమయ్యే అవకాశం

సగటున రోజు పల్నాడు జిల్లాలో 1.8లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే మరో 10 నుంచి 20 శాతం మంది అధికంగా ప్రయాణించే అవకాశముందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి తగ్గట్టుగా బస్సుల సంఖ్య పెంచాలని ప్రభుత్వానికి నివేదికలను ఇప్పటికే పంపారు. అయితే ఆ దిశగా బస్సుల సంఖ్య పెంచకపోతే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

కండీషన్ అంతంతమాత్రం

గ్రామీణ జనాభా అధికంగా ఉన్న పల్నాడు జిల్లాలో ఆర్టీసీ సేవలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. డిపోలలో బస్సుల కొరత తీవ్రంగా ఉంది. ఉన్న బస్సుల్లో చాలా వరకు కండీషన్‌లో లేవు. వినుకొండ, మాచర్ల బస్సుల్లో స్టీరింగ్ రాడ్‌లు విరిగిపోయి ప్రమాదం నుంచి తప్పించుకున్న ఘటనలు చూస్తున్నాం. మరోవైపు డ్రైవర్లు, కండక్టర్ల పోస్టులు భారీగా ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటిని భర్తీ చేయలేదు. దీంతో గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులు లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సిబ్బంది కొరత వేధిస్తోంది

కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉచిత బస్సు ప్రయాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతం కండక్టర్, డ్రైవర్ల కొరత వేధిస్తోంది. ఇందులో డ్రైవర్ల నియామకానికి ప్రకటన ఇస్తున్నాం. కండక్టర్ల నియామకాలపై ఉన్నతాధికారులు మార్గదర్శకాలు జారీ చేయాల్సి ఉంది. కొత్త బస్సుల మంజూరు గురించి సమాచారం లేదు.

– బి.శ్రీనివాసరావు, నరసరావుపేట డిపో మేనేజర్

14 లక్షల మందికి 325 బస్సులే

పల్నాడు జిల్లావ్యాప్తంగా ఆరు ఆర్టీసీ బస్సు డిపోల పరిధిలో మొత్తం 469 బస్సులు అందుబాటులో ఉన్నాయి. వాటిలో సాధారణ రోజుల్లో సుమారు 439 బస్సులు ప్రయాణికులకు సేవలు అందిస్తుంటాయి. ఇందులో 325 పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. ఇవే పల్నాడు జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. ఇప్పటికే ఆయా రూట్లలో బస్సులు తక్కువగా ఉండటం, రోడ్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆర్టీసీ సర్వీసులపై గతేడాదిగా విమర్శలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉచిత బస్సు ప్రయాణమంటే కొంత ఆక్యుపెన్సీ పెరిగే అవకాశం ఉంటుంది. జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళలు 10.24 లక్షలుండగా ప్రస్తుతం ఆ సంఖ్య సుమారు 14 లక్షలు ఉండే అవకాశం ఉంది. ఇంతమంది మహిళలున్న జిల్లాలో కేవలం 325 పల్లెవెలుగు బస్సులకు మాత్రమే ఉచిత సదుపాయం ఇవ్వడమేంటని మహిళామణులు ప్రశ్నిస్తున్నారు.



195 పల్లెలకు చేరని బస్సు



పల్నాడు జిల్లావ్యాప్తంగా చిన్న ఆవాసాలు కాకుండా ఓ మోస్తారు జనాభా ఉన్న 195 గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. ఇందులో మాచర్ల డిపో పరిధిలో 55 గ్రామాలు, వినుకొండ డిపో పరిధిలో 66 గ్రామాలు, పిడుగురాళ్ల డిపో పరిధిలో 17 గ్రామాలు, నరసరావుపేట డిపో పరిధిలో 15 గ్రామాలు, సత్తెనపల్లి డిపో పరిధిలో 22 గ్రామాలకు, చిలకలూరిపేట డిపో పరిధిలో 20 గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. ముఖ్యంగా మాచర్ల, వినుకొండ డిపో పరిధిలోని గ్రామాలలో ఈ సమస్య అధికంగా ఉంది. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేని గ్రామాల ప్రజలు ఆటోలపై ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు బడులు, కళాశాలకు వెళ్లడానికి కూడా ప్రత్యేక సర్వీసులు ఏర్పాటుచేయకపోవడంతో ఆటోలలో ప్రమాదకరంగా ప్రయణిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తేనే ఉచిత బస్సు ప్రయోజనాలను మహిళలు పొందగలుగుతారు. లేకపోతే కూటమి ప్రభుత్వం ప్రచారానికి మాత్రమే ఈ పథకం అమలు పరిమితం కానుంది.

రాష్ట్రమంతా అంటూ ఊదరగొట్టారు



ఎన్నికల ముందు కూటమి నేతలు ఇంటింటికి తిరిగి రాష్ట్రమంతా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ఊదరగొట్టారు. తాజాగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కేవలం పల్లె వెలుగు, అల్ట్రా డీలక్స్ బస్సులలో మాత్రమే సదుపాయం ఉంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. దీనిపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఎక్కడా పల్లెవెలుగు, అల్ట్రా డీలక్స్ బస్సులలో మాత్రమే ఉచితమని చెప్పలేదు. తీరా అధికారం చేపట్టిన తరువాత చంద్రబాబు తన సహజ బుద్ధిని బయటపెట్టి హామీలో కోతలు పెట్టాడని మహిళలు ఆరోపిస్తున్నారు. చిరువ్యాపారాలు, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, విద్యార్థినులు పట్టణాలకు వెళ్లాలంటే ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ సర్వీసులు ఎక్కువగా ఉంటాయి, వాటిలో ప్రయాణ సదుపాయం ఇవ్వకపోతే ఉపయోగమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడున్న ఒకటి అర పల్లెవెలుగు బస్సులో ప్రయాణించడం కష్టమని పెదవి విరుస్తున్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త అక్రమ నిర్బంధం

- అదుపులోకి తీసుకున్న పిడుగురాళ్ల పోలీసులు
- హైకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే కాసు
- కరీంషా భార్య సైదాబీచే హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు
- జుడీషియల్ కస్టడీకి ఆదేశించిన ఉన్నత న్యాయస్థానం

పిడుగురాళ్లరూరల్: టీడీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించేందుకు వైఎస్సార్ సీపీ నాయకుడిని పిడుగురాళ్ల పోలీసులు అదుపులోకి తీసుకొని భయపెట్టి వారి శైలిలో కేసును రాజీ చేసే యత్నం విఫలం అయ్యే విధంగా గురజాల మాజీ శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి కృషి చేశారు. వివరాలలోకి వెళ్తే... పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామానికి చెందిన పఠాన్ కరీంషా 2018లో వైఎస్సార్ సీపీలో చేరి, అప్పటినుంచి పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో 2020లో అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు షేక్ మాబు సుభానితోపాటు మరికొంత మంది వ్యక్తులు పఠాన్ కరీంషాను తల పగలగొట్టి తీవ్రంగా గాయపరిచారు. ఆ సమయంలో పఠాన్ కరీంషాను కొట్టి గాయపరిచిన షేక్ మాబుసుభానితోపాటు మరికొంత మందిపై 307 సెక్షన్ కింద కేసు నమోదయింది. తర్వాత 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో టీడీపీ నాయకులు పఠాన్ కరీంషాను గుత్తికొండలో ఉంటే చంపేస్తామని భయభ్రాంతులకు గురి చేయటంతో గత్యంతరం లేక పఠాన్ కరీంషా అత్తగారి ఊరైన నకరికల్లు గ్రామానికి వెళ్లి నివసిస్తున్నాడు.

జుడీషియల్ కస్టడీకి ఆదేశాలు

ఈ క్రమంలోనే పిడుగురాళ్ల పట్టణ పోలీసులు సోమవారం తెల్లవారుజామున వైఎస్సార్ సీపీ నాయకుడు పఠాన్ కరీంషాను బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. తమదైన శైలిలో గతంలో ఉన్న 307 కేసు రాజీపడాలని తీవ్ర ఒత్తిడికి గురి చేశారు. సమాచారం తెలుసుకున్న పఠాన్ కరీంషా భార్య పఠాన్ సైదాబీ వెంటనే గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి తీసుకొని రావటంతో ఆయన పార్టీ లీగల్ సెల్‌తో మాట్లాడి హైకోర్టులో పఠాన్ కనిపించటం లేదంటూ హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయించారు. హైకోర్టు బెంచి లంచ్ సమయంలో పిటిషన్‌ను విచారణకు స్వీకరించి, స్పందించిందని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షురాలు మాధవీలత తెలిపారు.

పఠాన్ కరీంషాను పోలీస్ స్టేషన్‌లో ఉంచవద్దని, జుడీషియల్ కస్టడీలో ఉంచాలని, మంగళవారం మధ్యాహ్నం తమ ముందు హాజరుపరచాలని హైకోర్టు ఆదేశించటంతో అప్పటికప్పుడు పట్టణ పోలీసులు చేసేది లేక పఠాన్ కరీంషాను జుడీషియల్ కస్టడీకి పంపించినట్లు సమాచారం. ఈ విషయమై పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావును 'సాక్షి' వివరణ కోరగా పఠాన్ కరీంషాను అదుపులోకి తీసుకున్న మాట వాస్తవమేనని, అయితే వెంటనే పంపించటం జరిగిందని తెలిపారు. దీనిపై బాధితుడి కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి, పార్టీ లీగల్‌సెల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అర్జీల సత్వర పరిష్కారానికి కృషి

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ

నరసరావుపేట: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో 148 అర్జీలు స్వీకరించారు. అధికారులు అందరూ అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఎటువంటిజాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. జేసీ సూరజ్ గనోరే, డీఆర్‌ఓ ఏకా మురళి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్నారు..

వినుకొండ రూరల్ పరిధిలోని 2.45 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించి ఎన్ఎస్పీ కాలువతో సహా రిజిష్టర్ చేయించుకున్న శాంతమ్మ, సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. దీనిపై ఈ ఏడాది మే 28న ఒకసారి తహసీల్దార్‌కు, జూన్ 30న గ్రీవెన్సెల్‌లో మరోసారి ఫిర్యాదు చేశాం. ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఆక్రమణ దారుల్లో ప్రభుత్వ అధికారులు, ప్రముఖులు ఉన్నారు. వారిపై విచారణ చేయించి ఆ భూములను స్వాధీనం చేసుకోవాలి.

–వై.వెంకటేశ్వరరావు, మస్తాన్‌వలి, పీడీఎం

బల్లకట్టు ప్రయాణికులకు రక్షణ కల్పించండి

సరైన భద్రతా చర్యలు లేని చింతిర్యాల గోవిందపురం వద్దనున్న బల్లకట్టుపై ప్రయాణం చేస్తున్న వారందరికీ రక్షణ కల్పించాలి. ఏదైనా ప్రమాదం జరిగితే బల్లకట్టుపై ప్రయాణికులను రక్షించేందుకు గజ ఈతగాళ్లు లేరు. బెలూన్లు లేవు.

– ప్రజాసంఘాల నాయకులు

ఇదేనా సంక్షేమం?!

- నరసరావుపేటలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- పది గదుల్లో లేని లైట్లు, ఫ్యాన్లు
- ఒక్కో గదిలో 15 నుంచి 20 మంది విద్యార్థులు
- ఒక్కో బాత్రూమ్‌ను వినియోగిస్తున్న 30 మంది విద్యార్థులు
- విద్యార్థుల దుర్భర స్థితిపై డాక్టర్ గోపిరెడ్డి ఆవేదన



హాస్టల్‌లో దుస్థితిని విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల నిర్వాహణ దారుణంగా ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం పట్టణంలోని రామిరెడ్డిపేట పాత సమితి కార్యాలయ సెంటర్ సమీపంలోని ప్రభుత్వ సంక్షేమ బాలుర ఎస్సీ హాస్టల్‌ను పరిశీలించారు. హాస్టల్ రెండు అంతస్తులు తిరిగి చూశారు. వంటశాలను పరిశీలించి విద్యార్థుల కోసం తయారుచేస్తున్న అన్నం, కూరలను పరిశీలించారు. అన్నం తిని రుచిచూశారు.. తాము పడుతున్న బాధలను విద్యార్థులు డాక్టర్ గోపిరెడ్డికి వెల్లడించారు.

- హాస్టల్‌లో సుమారు 160 మంది విద్యార్థులు ఉంటుండగా వారందరూ రూమ్‌కు 15 నుంచి 20మంది వరకు ఉండటాన్ని గమనించారు.
- అలాగే సుమారు పదిరూమ్‌లలో లైట్లు, ఫ్యాన్లు లేకపోవటం, బాత్రూమ్‌లో లైటు లేకపోవటాన్ని గమనించి వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు.
- ఎక్కడిచెత్త అక్కడనే కుప్పలుగా పడిఉండటాన్ని గమనించి వార్డెన్‌ను ప్రశ్నించగా వర్కర్లు లేరని వార్డెన్ సమాధానం ఇచ్చారు. వైఎస్సార్ సీపీ తరఫున 24గంటల వ్యవధిలో ఫ్యాన్లు, లైట్లు వేయిస్తామని హామీ ఇచ్చారు.



హాస్టల్‌కు సరఫరా చేసిన బియ్యంలో కనిపిస్తున్న ముక్క పురుగులు

అధ్వాన స్థితిలో హాస్టళ్లు

అనంతరం మీడియాతో డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం నుంచి విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్టైఫండ్ రావట్లేదన్నారు. విద్యార్థులకు ఫ్యాన్లు, లైట్లు, బెడ్లు లేవని చెప్పారు. ఈ హాస్టల్‌లో రెండు వారాల నుంచి పది రూములలో లైట్లు లేవని, లైటు లేకుండా ఏవిధంగా చదువుకుంటారని ప్రశ్నించారు. ఒక్కో బాత్‌రూమ్ 30మంది విద్యార్థులు వినియోగించుకుంటున్నారని, దానిలో లైటుకూడా లేదని చెప్పారు. తాగేందుకు మంచినీరు లేకపోవటంతో ఎదురుగా ఉన్న ఆర్‌ఓ ప్లాంట్‌లోని నీటిని కొనితెచ్చుకొని తాగుతున్నారన్నారు. వారానికి ఒక్కసారి మాత్రమే ఒక మహిళచేత చెత్త ఊడ్పిస్తున్నారన్నారు. పారిశుద్ధ్యం లోపించటంతో దోమలు, ఈగలు కారణంగా జ్వరాలతో విద్యార్థులు బాధపడుతున్నారన్నారు. ఇంజినీరింగ్, ఇంటర్ విద్యార్థులు హాస్టల్‌లో ఉంటున్నారన్నారు. పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్ మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.సుజాతాపాల్, పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, వర్కింగ్ అధ్యక్షుడు అచ్చిశివకోటి, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బూదాల కల్యాణ్, మాదిగ కార్పొరేషన్ మాజీ డైరక్టర్ కందుల ఎజ్రా, గంటెన పాటి గాబ్రియేలు, కుక్కల పౌలు, మైలేరి మార్క్, వేణుమాధవ్, మణికంఠారెడ్డి, షాయాబ్, శాంతకుమార్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ తరఫున లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తాం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో హాస్టళ్లను చాలా చక్కగా నిర్వహించారని, నాడు–నేడు కింద హాస్టళ్లను బాగుచేసే ప్రయత్నంలో ప్రభుత్వం మారిందన్నారు. కూటమి హయాంలో నేడు తినేందుకు ఇచ్చిన బియ్యంలో ముక్కపురుగులు తిరుగుతున్నాయన్నారు. హాస్టల్‌లోని ఎస్సీ విద్యార్థులు చదువుకునే పరిస్థితి కన్పించట్లేదన్నారు. హాస్టల్ బిల్డింగ్ యజమానే హాస్టల్‌కు రంగులు వేయించాడని చెప్పారు. ఒక రూమ్‌లో పదిహేను రోజుల నుంచి లైటు లేకుండా విద్యార్థులు ఉంటున్నారంటే హాస్టల్ పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 13 నెలల కాలంలో రూ.1.75లక్షల కోట్ల అప్పులు తెచ్చిందని, ఆ డబ్బులతో కనీసంగా హాస్టళ్లను కూడా బాగుచేయకుండా వాటిని దిగమింగుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ తరఫున ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌చే లైట్లు వేయిస్తున్నామని, ఎస్సీ సోదరుల సహకారంతో మరో 24గంటల్లో ఫ్యాన్లు వేయిస్తామని భరోసా ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ పెద్దలు మొద్దునిద్ర పోతున్నారని, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి వెంటనే హాస్టళ్లను విజిట్ చేయాలని డిమాండ్ చేశారు.



హాస్టల్ వంటశాలలో అన్నాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

వంతెనపై ప్రయాణం.. భయం !

- బెల్లంకొండ బ్రాంచి కెనాల్ వంతెనపై పొంచి ఉన్న ప్రమాదం
- కూలిపోయిన సైడ్ వాల్స్
- శిథిలావస్థకు చేరిన అంతర్గత సైడ్ వాల్స్
- పట్టించుకోని అధికారులు


శిథిలావస్థకు చేరుకోవడంతో పగిలిపోయి ఉన్న బీబీసీ అంతర్గత సైడ్‌వాల్స్


సైడ్ వాల్ విరిగిపోయి ప్రమాదకరంగా మారిన బెల్లంకొండ బ్రాంచి కెనాల్

నకరికల్లు: నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే వంతెనపై ప్రయాణం ప్రమాదంగా మారింది. మండలం పరిధిలోని నకరికల్లు – మాచర్ల రహదారిలో బెల్లంకొండ బ్రాంచికెనాల్ వంతెనపై ప్రమాదం పొంచి ఉంది. వంతెనకు ఇరువైపులా ఏర్పాటు చేసిన అల్యూమినియం సైడ్‌వాల్స్ విరిగిపోయాయి. దీంతో వాహనాలు అదుపుతప్పితే కెనాల్‌లో పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. గతంలో ఇదే ప్రదేశంలో అదుపుతప్పిన లారీ కెనాల్‌లో పడిపోయింది. ప్రాణాపాయం తప్పినప్పటికీ వాహనం మొత్తం నుజ్జునుజ్జయింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సత్వరమే వంతెనకు సైడ్‌వాల్స్‌ను పటిష్టం చేసి, వంతెనకు ఇరువైపులా పూర్తిస్థాయిలో వాటిని నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

ధ్వంసమైన అంతర్గత సైడ్‌వాల్స్

బెల్లంకొండ బ్రాంచి కెనాల్ పరిధిలో నకరికల్లు, రాజుపాలెం మండలాల పొలాలకు సాగునీటిని సరఫరా చేస్తారు. నర్సింగపాడు గ్రామం సమీపంలోని వంతెన వద్ద సాగునీరు సక్రమంగా కెనాల్‌లో పయనించేందుకు, కట్ట కోతకు గురికాకుండా సైడ్‌వాల్స్‌ను నిర్మించారు. ప్రస్తుతం సైడ్‌వాల్స్ పూర్తిగా దెబ్బతిని ధ్వంసమై ఉన్నాయి. సైడ్‌వాల్స్ పగిలిపోయిన కారణంగా కట్ట కోతకు గురికావడం, గండిపడడం, సాగునీటి వృథా అయ్యే ప్రమాదం పొంచి ఉంది. నిత్యం కంటికి కనిపించే సమస్య అయినప్పటికీ అంతర్గత సైడ్‌వాల్స్‌కు మరమ్మతులు చేయడంపై ఎన్నెస్పీ అధికారులు దృష్టిసారించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

పూడుకుపోయిన పంట కాలువ

బెల్లంకొండ బ్రాంచి కెనాల్ నుంచి పొలాల్లోకి సాగునీరు సరఫరా చేసే పంటకాలువ పిచ్చి చెట్లు, ముళ్లపొదలు, గడ్డితో పూడుకుపోయింది. కనీసం కాలువ కూడా కనిపించే పరిస్థితి లేదు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న తరుణంలో సాగునీటి సరఫరా అవశ్యం. కానీ పంటకాలువ పూడిపోవడంతో పొలాలకు నీరుచేరే అవకాశం కన్పించడం లేదు. సాగునీటి విడుదలకు చాలా సమయం పట్టినప్పటికీ పంటకాలువను సిద్ధం చేసుకోవడంలో అధికారులు దృష్టి సారించకపోవడంతో పొలాలకు సాగునీరు సక్రమంగా చేరుతుందా అన్న ఆందోళన అన్నదాతల్లో నెలకొని ఉంది.


పొదలు, పిచ్చిచెట్లతో పూడుకుపోయిన బీబీసీ నుంచి వెళ్లే పంట కాలువ

రక్షణ గోడలు నిర్మించాలి



నర్సింగపాడు సమీపంలోని బెల్లంకొండ బ్రాంచికెనాల్ కాలువపై గల వంతెన రక్షణ గోడలు పూర్తిగా విరిగిపోయాయి. గతంలో వాహనాలు ఢీకొని అల్యూమినియం వాల్స్ విరిగిపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలో జరిగిన ప్రమాదాల దృష్ట్యా సంబంధిత శాఖల అధికారులు స్పందించి సత్వరమే మరమ్మతులు చేపట్టాలి.

– ముజావర్ జాన్‌అహ్మద్, స.హ.చట్టం ప్రచార ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి

రూ.2కోట్లతో చిట్టీ నిర్వాహకులు పరారీ

పోలీసు పీజీఆర్ఎస్‌లో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన లింగంగుంట్ల గ్రామస్తులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: చిట్‌ల పేరుతో వసూళ్లు చేసిన సుమారు రూ.2కోట్ల సొమ్ముతో నిర్వాహకులు పరారైనట్లు నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి చెందిన పలువురు బాధితులు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలకు సంబంధించిన 98 ఫిర్యాదులు అందాయి.

చిట్టీ పేరిట 100 మందికి టోపీ

లింగంగుంట్ల గ్రామంలో పానుగంటి ప్రసాద్, రంగమ్మలు గత 30 సంవత్సరాలుగా చిట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. సకాలంలో డబ్బులు చెల్లిస్తుండటంతో నమ్మిన గ్రామస్తులు అధిక సంఖ్యలో సభ్యులుగా చేరారు. 20 రోజుల నుంచి ప్రసాద్, రంగమ్మలు కనిపించకుండా పోయారు. ఆందోళనకు గురైన చిట్ సభ్యులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సుమారు 100 మందికి రూ.2కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు.

లోన్ నగదు చెల్లించకుండా మోసం

బ్యాంక్‌లో తీసుకున్న స్త్రీనిధి లోన్‌లు చెల్లించకుండా పొదుపు సంఘాల గ్రూపు సెకండ్ లీడర్ మోసం చేసినట్టు రాజుపాలెం మండలం చౌటుప్పాయపాలెం గ్రామానికి చెందిన మత్తమ్మ ఎస్పీకి తెలిపింది. రాజీవ్ మహిళా పొదుపు గ్రూపులో సభ్యులు స్త్రీ నిధి లోన్ కింద రూ.2.50లక్షలు, బ్యాంక్ ద్వారా మరో రూ.5లక్షలు రుణాలు తీసుకొని ప్రతి నెల వాయిదా నగదును గ్రూప్ సెకండ్ లీడర్ ప్రమీలరాణికి చెల్లిస్తున్నట్టు తెలిపారు. గ్రూప్‌లోని మహిళలు బ్యాంక్ సిబ్బందిని సంప్రదించగా 19నెలల నుంచి లోన్ డబ్బులు చెల్లించలేదని తెలిపారు. దీనిపై ప్రమీలరాణిని ప్రశ్నించగా ఆమెతో పాటు భర్త తమ పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు అసభ్యంగా మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొంది.

నా బిడ్డను అప్పగించండి

భర్త వద్ద నుంచి బిడ్డను తనకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని నకరికల్లు మండలం దేచవరం గ్రామానికి చెందిన సిరికొండ నాగలక్ష్మి ఎస్పీకి ఫిర్యాదు చేసింది. విశాఖపట్నంలోని కంచరపాలెంకు చెందిన మిడిదొడ్డి కిషోర్‌కుమార్‌తో 2020 సంవత్సరంలో వివాహం జరగ్గా, ఆ తర్వాత రెండు సంవత్సరాలకే మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్టు తెలిపింది. దీనిపై భర్తను నిలదీయడంతో కుమారుడితో పాటు తనను ఇంటిలో ఉంచి తాళం వేసి బయటకు రానివ్వకుండా చిత్రహింసలకు గురిచేసాడని తెలిపింది. ఇంటి నుంచి పారిపోయి పుట్టింటికి చేరినట్టు వివరించింది. తన కుమారుడిని తనకు అప్పగించి న్యాయం చేయాలని కోరింది.

బకాయిలు అడిగితే బెదిరిస్తున్నారు

సెల్‌ఫోన్‌లు సరఫరా చేసిన నిమిత్తం చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకుండా ఇద్దరు వ్యాపారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని సత్తెనపల్లికి చెందిన కోరప్రోలు లక్ష్మీ వెంకట నరసింహగుప్త ఎస్పీకి అందజేసిన ఫిర్యాదులో తెలిపాడు. తాను సెల్‌ఫోన్ వ్యాపారం చేస్తుంటానని, సత్తెనపల్లికే చెందిన బచ్చు పూర్ణ పవన్ నాగసాయి శేఖర్‌కు రూ.28.75లక్షలు, తొమంద్రు ప్రసాద్‌కు రూ.25లక్షలు విలువైన సెల్‌ఫోన్‌లను అందజేసినట్టు పేర్కొన్నారు. బకాయిలు చెల్లించకుండా ఇరువురు ఇబ్బందులు పెడుతున్నారని తెలిపాడు. డబ్బులు గురించి అడిగితే చంపుతామని బెదిరిస్తున్నట్టు వివరించాడు.

ప్రేమ పేరుతో వంచించాడు

ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువకుడు మోసం చేసినట్టు బొల్లాపల్లి మండలం నెహ్రూనగర్ తండాకు చెందిన బాలిక జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. మైనర్‌నైన తనను మభ్యపెట్టి లైంగికదాడికి పాల్పడ్డాడని, ఇప్పుడు పెళ్లిచేసుకోమంటే తప్పించుకొని తిరుగుతున్నాడని తెలిపింది. యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరింది.

ప్రో నోట్ ఇవ్వకుండా వేధింపులు

అప్పుగా తీసుకున్న డబ్బులు చెల్లించినా ప్రోనోటు ఇవ్వకుండా వేధిస్తున్నాడని నరసరావుపేట మండలం పమిడిపాడుకు చెందిన షేక్ ఆదం వలి ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. తమ గ్రామానికి చెందిన షేక్ దరియావలి నుంచి సాలసకు చెందిన బొక్కా మరియదాసుకు రూ.4.20లక్షలు అప్పుగా ఇప్పించగా ప్రతి నెల వడ్డీ చెల్లించాడని తెలిపాడు. కరోనా సమయంలో వడ్డీ చెల్లించకపోవడంతో సెటిల్మెంట్ కింద రూ.5లక్షలు చెల్లించినట్టు పేర్కొన్నాడు. ప్రోనోట్లు ఇవ్వమని అడగ్గా మరో రూ.8లక్షలు చెల్లించాలని చెప్పి మధ్యవర్తిగా ఉన్న తన స్థలంలో గేదెలను కట్టేసి బెదిరింపుకు పాల్పడుతున్నాడని తెలిపాడు.

విద్యార్థుల మెదడుకు పదును

- శాస్త్రీయ పరిశోధనల దిశగా ప్రోత్సాహం
- విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్ష ద్వారా ఎంపిక
- పరిశోధనలు, ప్రయోగాలపై ఆసక్తి కనబర్చే విద్యార్థులకు పుష్కల అవకాశాలు
- పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకార వేతనాలు
- హైస్కూల్ స్థాయి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో మొదలైన రిజిస్ట్రేషన్లు



వీవీఎం కాన్సెప్ట్


విద్యార్థులు (ఫైల్)



సత్తెనపల్లి/గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల మెదడుకు పదును పెట్టి భావి శాస్త్రవేత్తలుగా వారిని తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరిట జాతీయస్థాయి సైన్స్ ప్రతిభా పరీక్షను ఏటా దేశవ్యాప్తంగా అక్టోబర్‌లో నిర్వహిస్తోంది. ఇందులో ప్రతిభ చూపిన వారికి ఉపకార వేతనాలు ఇస్తోంది. ఆన్‌లైన్ పరీక్షకు రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి.

వీవీఎం 2025–26 ముఖ్యాంశాలు

జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) జాతీయ స్థాయిలో నిర్వహించనున్న వీవీఎం సైన్స్ ప్రతిభా పరీక్షకు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ బోర్డు నుంచి గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి 11వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు. పరీక్షను ఇంగ్లిష్, హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, మరాఠీ, గుజరాతీ, పంజాబీ, బెంగాలీ, ఒడియా, అస్సామీ భాషల్లో నిర్వహించనున్నారు. విద్యార్థులను పరిశోధన, ప్రయోగాల వైపు ప్రోత్సహించడం దీని లక్ష్యం. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ఉన్నత చదువుల కోసం కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు మంజూరు చేయనుంది.

శాస్త్ర, పరిశోధనలకు ప్రోత్సాహం

విద్యార్థుల్లో విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించడం, సంప్రదాయ యుగం నుంచి ఆధునిక యుగం వరకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన సహకారాల గురించి పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించడం వీవీఎం ముఖ్య ఉద్దేశం. వర్క్‌షాప్‌లు, కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ అందించి, శాస్త్రీయ దృక్పథం ఉన్న విద్యార్థులను గుర్తించడానికి పోటీ పరీక్షలను నిర్వహిస్తోంది. శాస్త్రీయ రంగంలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు పరిశోధనల దిశగా విద్యార్థులను సిద్ధం చేసేందుకు మార్గదర్శకులను అందించడం లక్ష్యం. రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయవంతమైన విద్యార్థులను గుర్తించి, వారిని సత్కరించడం, దేశంలోని వివిధ పరిశోధన, అభివృద్ధి సంస్థలకు విజేతల కోసం ఎక్స్‌పోజర్ సందర్శనలను నిర్వహించడం ముఖ్యమైన అంశాలుగా ఉన్నాయి.

పరీక్షకు రిజిస్ట్రేషన్

అక్టోబర్‌లో జరగనున్న ఆన్‌లైన్ పరీక్షకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. విద్యార్థుల తాము చదువుతున్న పాఠశాల హెచ్‌ఎం, ప్రిన్సిపాల్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలి. విద్యార్థులు వ్యక్తిగతంగానూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. వివిధ దశల్లో జరగనున్న వీవీఎం ప్రతిభా పరీక్ష సిలబస్, సబ్జెక్టు పరమైన సందేహాలు నివృత్తి, రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలకు vvm. org. in సైట్‌లో బ్రోచర్, నోటిఫికేషన్ పరిశీలించాలి.

టెన్త్‌లో నూరుశాతం ఫలితాలే లక్ష్యం

నరసరావుపేట: ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ చదువుతున్న ప్రతి విద్యార్థికి ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు పదవ తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. జిల్లాలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం తయారుచేసిన మెటీరియల్‌ను సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది విద్యార్థులకు ఈ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఈ ఏడాది ఇప్పటి నుంచే మెటీరియల్ పంపిణీ చేయాలని ఆదేశించారు. జేసీ సూరజ్ గనోరే, డీఆర్‌ఓ ఏకా మురళి, డీఈఓ చంద్రకళ పాల్గొన్నారు.

వసతి గృహాలు తనిఖీ చేయండి..

సంక్షేమ వసతి గృహాలను మండల స్పెషల్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మార్గదర్శకులు, బంగారు కుటుంబాల ఎంపిక కోసం నిర్వహిస్తున్న పీ ఫోర్ గ్రామ సభలను మండల స్పెషల్ ఆఫీసర్లు పర్యవేక్షించాలన్నారు. సోమవారం కార్యాలయంలో వివిధ అంశాలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సాగర్ జలాలు విడుదల చేయనున్న విషయాన్ని తహసీల్దార్లు స్థానికంగా ప్రచారం కల్పించాలన్నారు.

ఉచిత ఇసుక తూచ్!

- కిలోమీటరుకు ఇంతని వసూలు చేస్తున్న ప్రభుత్వం
- రేవుల నుంచి తెచ్చి యథేచ్ఛగా టీడీపీ నేతల ఇసుక దోపిడీ
- వాగులూ, వంకలనూ వదలని అక్రమార్కులు



సత్తెనపల్లి: ఎన్నికల ముందు ఉచితంగా ఇసుక ఇస్తామని ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు కిలోమీటర్లకు ఖరీదు కట్టి అమ్ముతోంది. భవన నిర్మాణదారుల నుంచి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని కృత్రిమ కొరత సృష్టించి సొమ్ము చేసుకుంటుంది. మరో వైపు అధికార పార్టీ నేతలు ఎక్కడ పడితే అక్కడ ఇష్టారీతిన తోడేస్తూ.. టిప్పర్లు, లారీల్లో అక్రమంగా ఇతర రాష్ట్రాలకు సైతం తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

యజమానులకు తప్పని భారం

ఇసుక బుక్ చేసుకోవడం తెలియని యజమానులు అందుబాటులో ఉన్న ఇసుకను కొనుగోలు చేసి తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన కూటమినేతలు అడ్డదారుల్లో ఇసుకను తీసుకువచ్చి ట్రాక్టర్లలో నిల్వ ఉంచి మరీ అందిన కాడికి దోచుకుంటూ విక్రయాలు చేస్తున్నారు. ఇసుక రేవుల్లోనే కాక వాగులు, వంకలను వదలకుండా ఇసుకు తీసుకు వస్తున్నారు. బుకింగ్ చేసుకుంటే రోజుల తరబడి జాప్యం అవుతుందనే ఉద్దేశంతో భవన యజమానులు అందుబాటులో ఉన్న ఇసుకను అధిక రేట్లకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇంత జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు.

కృత్రిమ కొరతతో ఇక్కట్లు

సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాలకు ఇసుక పెదకూరపాడు నియోజకవర్గంలోని అచ్చంపేట, అమరావతి మండలాల నుంచి సరఫరా అవుతుంది. ఆయా మండలాల్లోని ఇసుక రేవుల నుంచి ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్ల ద్వారా ఇసుక సరఫరా అవుతుంది. జూన్ 12న కొలువు దీరిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అందరికీ ఉచిత ఇసుక అంటూ బూటకపు హామీ ఇవ్వడంతో భవన నిర్మాణ యజమానులు కొంతకాలం వేచి చూశారు. అయితే కూటమి సర్కారు ఉచితమన్న పదానికి అర్థం మార్చేసింది. ఇసుకకు ధరలు కేటాయించింది. అంతేకాక జిల్లాకు ఒక స్టాక్ యార్డు పెట్టి ఇసుక కృత్రిమ కొరత సృష్టించింది. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా చేయడంతో కార్మికులు ఇళ్లకే పరిమితమై ఆందోళనలు చేశారు. మొన్నటివరకు ఆషాఢ మాసం కావడంతో గృహ నిర్మాణాలు ప్రారంభించేందుకు యజమానులు ముందుకు రాలేదు. ప్రస్తుతం శ్రావణమాసం రావడంతో భవన నిర్మాణాలు ఊపందుకోనున్నాయి. ఈ క్రమంలో ఇసుక కృత్రిమ కొరత సృష్టిస్తే భవన నిర్మాణ కార్మికులకు పనులు దొరికే పరిస్థితి ఉండదు.

ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో పంచ జ్యోతిర్లింగ యాత్ర

లక్ష్మీపురం: ఇండియన్ రైల్వే క్యాటరింగ్, టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో సికింద్రాబాద్ నుంచి పంచ జ్యోతిర్లింగ దర్శన్‌తో అంబేడ్కర్ యాత్రను నిర్వహించనున్నట్లు ఏరియా మేనేజర్ ఎం.రాజా సోమవారం తెలిపారు. యాత్ర ఆగస్టు 16 నుంచి 24వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. జ్యోతిర్లింగ దర్శనాలలో ప్రధానంగా నాగపూర్‌లో అంబేడ్కర్ బౌద్ధ మతాన్ని స్వీకరించిన దీక్షా భూమి స్తూపం, శ్రీ స్వామినారాయణ మందిరం, ఉజ్జయిన్ మహాకాళేశ్వర జ్యోతిర్లింగం, ఓంకారేశ్వర జ్యోతిర్లింగం, అంబేడ్కర్ జన్మస్థలం, నాసిక్ త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం, పూణేలో భీమ శంకర్ జ్యోతిర్లింగం, ఔరంగాబాద్‌లో గ్రిష్ణేశ్వర జ్యోతిర్లింగం దర్శన ఉంటుందని వివరించారు. యాత్ర సికింద్రాబాద్ నుంచి నిజామాబాద్ మీదుగా సాగుతుందని తెలిపారు. ఒక్కో వ్యక్తికి స్లీపర్ క్లాస్ పెద్దలయితే నాన్ ఏసీ గదుల్లో హోటల్ వసతి, నాన్ ఏసీ వాహనంతో కలిపి రూ.14,700, త్రీ ఏసీ అయితే ఏసీ గది, నాన్ ఏసీ వాహనంతో కలిపి రూ.22,900 ఉంటుందని వివరించారు. టూ ఏసీ అయితే ఏసీ గది, ఏసీ వాహనంతో కలిపి రూ.29,900, పిల్లలు 5 సంవత్సరాల నుంచి 11 సంవత్సరాల లోపు వారికి స్లీపర్ క్లాస్ రూ.13,700, త్రీ ఏసీ రూ.21,700, టూ ఏసీ రూ.28,400 ఉంటుందని తెలిపారు. యాత్రికులకు ప్రతి రోజు ఉదయం టీ, అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం (శాఖాహారం మాత్రమే), ప్రయాణ బీమా, వృత్తిపరమైన, స్నేహపూర్వక పర్యటన ఎస్కార్ట్ సేవలు, రైలులో భద్రత, అవసరమైన సహాయం కోసం ఐఆర్‌సీటీసీ మేనేజర్లు టూర్ అంతటా ప్రయాణిస్తారని తెలియజేశారు. యాత్ర కోసం ఐఆర్‌సీటీసీ రైల్వే రిటైరింగ్ రూమ్, విజయవాడ రైల్వే స్టేషన్, ఫోన్ నంబర్ 9281495848ను సంప్రదించాలని ఆయన సూచించారు.